సాక్షి ఒడిశా

గురువారం । 2 । మార్చి । 2023



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

భువనేశ్వర్: పూరీ జగన్నాథాలయంలో భక్తులు కానుకల రూపంలో సమర్పించిన హుండీ ఆదాయాన్ని ఆలయ పాలకవర్గం బుధవారం లెక్కించారు. ఇందులో నగదు రూ. 3,79,089లు, బంగారం 1.25 గ్రాములు, వెండి 600 మిల్లీగ్రాములు వచ్చాయని అధికారులు వెల్లడించారు.

పర్లాకిమిడిలో ఉగాది ఉత్సవాలు

పర్లాకిమిడి: పట్టణంలోని రాంనగర్ హైటెక్ ప్లాజా గ్రౌండ్స్‌లో ఉగాది పురస్కరించుకుని ఈనెల 21, 22 తేదీల్లో సంస్కృతి ఉత్సవాలు నిర్వహించనున్నట్లు హైటెక్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ తిరుపతి పాణిగ్రాహి బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ ఉత్సవాలలో భాగంగా మార్చి 21న ముగ్గుల పోటీ, 22న ఉదయం ఉగాది పంచాంగ శ్రవణం, పచ్చడి పంపిణీ, కళింగ వైశ్యసంఘం ఆధ్వర్యంలో కూచిపూడి, ఒడిస్సీ నృత్యాలు జరగనున్నాయని కన్వీనర్ వీఎస్ఎన్ రాజు తెలిపారు.

తినరా మైమరచి..

- నందడిగా దొహిబొరా ఆలూదమ్ దివస్

- 8లో



న్యూస్‌రీల్

‘దివ్యాంగులకు సౌకర్యాలు కల్పించాలి’



ఎమ్మెల్యే నారాయణరావుకు వినతిపత్రం అందిస్తున్న నిరంజన్ బెహరా

పర్లాకిమిడి: గజపతి జిల్లాలో దివ్యాంగులకు ప్రభుత్వం అందిస్తున్న నెలవారీ భృతి పెంచాలని రాష్ట్ర దివ్యాంగుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు నిరంజన్ బెహరా, ప్రతినిధులు కోరారు. ఈ మేరకు పర్లాకిమిడి ఎమ్మెల్యే కోడూరు నారాయణరావును రాష్ట్ర రాజధాని భువనేశ్వర్‌లో బుధవారం కలిసి, వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ప్రధానమంత్రి ఆవాస్ యోజనా పథకం కింద ఇళ్ల కేటాయింపులో 5శాతం రిజర్వేషన్ కల్పించాలన్నారు. అలాగే రాష్ట్రంలో దివ్యాంగులకు మరిన్ని సౌకర్యాలు కల్పించాలని, వారి ఉన్నతికి చేపట్టాల్సిన చర్యలపై అసెంబ్లీ సమావేశాల్లో ప్రస్తావించాలని విన్నవించారు.

ఎక్సైజ్‌శాఖ విస్తృత దాడులు



ఎక్సైజ్ సిబ్బంది స్వాధీనం చేసుకున్న సారా నిల్వలు

రాయగడ: జిల్లాలోని గుణుపూర్, రాయగడ తదితర ప్రాంతాల్లో సిబ్బంది విస్తృతంగా దాడులు నిర్వహించారని ఎక్సైజ్‌శాఖ అధికారి అభిరాం బెహరా బుధవారం తెలిపారు. దాడుల్లో 22 కేసులు నమోదు చేసి, 10మందిని అరెస్ట్ చేశామన్నారు. నిందుతుల నుంచి 1036లీటర్ల సారా, 7700 లీటర్ల ఊట, 137 లీటర్ల ఈత కల్లు స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు.


ప్రభుత్వ తీరుపై బీజేపీ నిరసన



నిరసన వ్యక్తం చేస్తున్న బీజేపీ నాయకులు

పర్లాకిమిడి: రాష్ట్ర ఆరోగ్యశాఖ మంత్రి నవకిషోర్ దాస్ హత్యకేసు, అర్చనా నాగ్ హనీట్రాప్‌కేసుల్లో దోషులను రక్షించే రీతిలో రాష్ట్రప్రభుత్వం వ్యవహరిస్తోందని బీజేపీ యువజన మోర్చా నాయకులు ఆరోపించారు. ఉద్దేశపూర్వకంగా బీజేపీ నాయకులపై తప్పుడు కేసులు బనాయిస్తున్నారని మండిపడ్డారు. ఈ ఘటనలపై బీజేపీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే కోడూరు నారాయణరావు ఆదేశాల మేరకు బుధవారం సాయంత్రం పర్లాకిమిడి మహారాజా బాలుర ఉన్నత పాఠశాల ఎదుట నిరసన ప్రదర్శన చేశారు. అనంతరం సీఎం నవీన్ పట్నాయక్ ఫొటోకు నిప్పంటించారు. ఆందోళనలో యువజన మోర్చా జిల్లాశాఖ అధ్యక్షుడు బాలకృష్ణ పాత్రొ, పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సిద్దేశ్వర మిశ్రా, జగన్నాథ మహాపాత్రొ, మహిళా మోర్చా అధ్యక్షురాలు అరుణిమా సాహు, ప్రశాంత్, బబునా తదితరులు పాల్గొన్నారు.

మత్తు పదార్థాలను నిషేధించాలని వినతి



సబ్ కలెక్టర్ కార్యాలయంలో యువకులు

జయపురం: గుట్కా, ఖైనీ, పుడియా తదితర మత్తు పదార్థాల విక్రయాలను జయపురం సబ్ డివిజన్‌లో పూర్తిగా నిషేధించాలని స్థానిక యువత డిమాండ్ చేస్తోంది. ఈ మేరకు సమాజిక కార్యకర్త బి.హరిరావు నేతృత్వంలో యువకులు జయపురం సబ్ కలెక్టర్ కార్యాలయ అధికిరులకు బుధవారం వినతిపత్రం సమర్పించారు. పొగాకుతో తయారు చేసే మత్తు కలిగించే పదార్థాల వల్ల యువత దారి తప్పుతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. సమాజానికి వెన్నెముక అయిన యువతరాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. విచ్చలవిడిగా జరుగుతున్న ఈ విక్రయాల కారణంగా ఎంతోమంది అనారోగ్యానికి గురై, ప్రాణాలు కోల్పోతున్నారని వాపోయారు. దీనిపై అధికారులు దృష్టి సారించి, నిషేదానికి చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో యువకులు సాను జానీ, బలరాం పాయక్, రామ ఖొరా, బందుకు జానీ, రమేష్ జానీ, సోను జానీ తదితరులు పాల్గొన్నారు.

తొలి విడత సమాప్తం!

- అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు వాయిదా: స్పీకర్
- బెడిసికొట్టిన అఖిలపక్ష సమావేశం
- ఈనెల 10నుంచి రెండో విడత సమావేశాలు
- సభాపతికి ప్రివిలేజ్ నోటీసు అందజేసిన కాంగ్రెస్



స్పీకర్ పోడియంను చుట్టుముట్టిన కాంగ్రెస్, బీజేపీ ఎమ్మెల్యేలు



మీడియాతో మాట్లాడుతున్న సీఎల్పీ నేత నర్సింగ మిశ్రా

భువనేశ్వర్: రాష్ట్ర శాసనసభలో బడ్జెట్ సమావేశాలకు బుధవారం తెరదించారు. స్పీకర్ విక్రమకేశరి అరూఖ్ అధ్యక్షతన జరిగిన అఖిలపక్ష సమావేశం విఫలమైంది. సభా కార్యక్రమాలు సజావుగా నిర్వహించేందుకు ఆయన చేసిన ప్రయత్నాలు నీరుగారాయి. ఈ విచారకర పరిస్థితుల్లో సమావేశాలు ఈనెల 10 ఉదయం 10.30 గంటల వరకు నిరవధికంగా వాయిదా వేసినట్లు సభాపతి ప్రకటించారు. విపక్షాలు బీజేపీ, కాంగ్రెస్ సభ్యుల గందరగోళం మధ్య సాధారణ బడ్జెట్‌పై చర్చలు ముగిశాయి. దీంతో ఈ ఏడాది సమావేశాల తొలి విడతకు తెరపడింది. మలివిడత సమావేశాలు ఈనెల 10 నుంచి ఏప్రిల్ 6వరకు కొనసాగాల్సి ఉంది. రాష్ట్రాన్ని ఎవరు పాలిస్తున్నారు? పోలీసులకు ఆయుధాలు కల్పించింది ఎవరు? ఇలా రాష్ట్రంలో లోపించిన శాంతిభద్రతల పట్ల విపక్షం భారతీయ జనతాపార్టీ విరుచుకు పడింది. ఈ సందేహాల నివృత్తికి స్పీకర్ రూలింగ్ ఇవ్వాలని ఆ పార్టీ మొండికేసింది. కొందరు సభ్యులు స్పీకర్ పోడియం చుట్టుముట్టి, రభస సృష్టించారు. ఈ పరిస్థితిని సవరించేందుకు అరూఖ్ అఖిలపక్ష సమావేశానికి పిలుపునిచ్చారు. ఆయన అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో కొన్ని అంశాలపై ఏకాభిప్రాయం కుదరక పోవడంతో సభ నిర్వహణ సాధ్యం కాదని నిర్ణయానికి వచ్చారు. దీంతో సమావేశాలు నిరవధికంగా వాయిదా వేస్తున్నట్లు ప్రకటించారు.

తప్పుదోవ పట్టించారు..

రాష్ట్ర ఆరోగ్య-కుటుంబ సంక్షేమ శాఖామంత్రి నవకిషోర్ దాస్ హత్య విచారణపై జరిగిన చర్చ పురస్కరించుకుని ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ అసెంబ్లీని తప్పుదోవ పట్టించారని కాంగ్రెసు శాసనసభ నాయకుడు, బొలంగీర్ నియోజకవర్గ ఎమ్మెల్యే నర్సింగ మిశ్రా ఈ సందర్భంగా ఆరోపించారు. ఈ నేపథ్యంలో సీఎం నవీన్, హోంశాఖ సహాయ మంత్రి తుషారకాంతి బెహరా లపై కాంగ్రెస్ ప్రత్యేక హక్కుల ఉల్లంఘన(ప్రివిలేజ్) నోటీసును బుధవారం జరిగిన సమావేశాల్లో ప్రతిపాదించింది. హత్యకేసు దర్యాప్తు పర్యవేక్షణకు హైకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ జేపీ దాస్‌ను నియామిస్తున్నట్లు ప్రకటించి.. సభను తప్పుదోవ పట్టించారని నర్సింగ మిశ్రా అసెంబ్లీ కార్యదర్శికి జారీ చేసిన నోటీసులో పేర్కొన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి తరపున హోంశాఖ సహాయ మంత్రి అసెంబ్లీలో ప్రకటన జారీ చేసినట్లు ఆయన గుర్తు చేశారు. ఈ నేపథ్యంలో హోంశాఖ బాధ్యతలు నిర్వహిస్తున్న సీఎం, సహాయ మంత్రి బెహరార ఉద్దేశ పూర్వకంగా తప్పుడు సమాచారం ఇచ్చి, సభ్యులను తప్పుదోవ పట్టించారన్నారు. కోర్టు పర్యవేక్షణలో మంత్రి నవకిషోర్ దాస్ హత్య ఘటనపై విచారణ కొనసాగుతుందని ప్రకటన జారీ చేయడం సరైనది కాదని ఆరోపించారు. ఈ ఉత్తర్వు కోర్టు నుంచి జారీ కాలేదని గుర్తు చేశారు.

ప్రివిలేజ్ తీర్మానానికి ఆమోదం..

పాలన, అధికారిక స్థాయిలో ఆమోదించి.. విచారణ చట్టపరంగా సాగుతున్నట్లు నిండు సభలో ప్రకటించి బురిడీ కొట్టించారని సీఎల్పీ నాయకుడు వ్యాఖ్యానించారు. ఇదిపూర్తిగా తప్పుడు సమాచారమని, సభను తప్పుదోవ పట్టించడానికి ఉపయోగించబడిందని ఆక్షేపించారు. ఇది సభ ప్రత్యేక హక్కును ఉల్లంఘిస్తుందని పేర్కొన్నారు, ముఖ్యమంత్రి తరపున హోంశాఖ సహాయ మంత్రి ప్రకటన ఇచ్చినందున ఆయన తీరు కూడా అభ్యంతరకరమని తేవనెత్తారు. కాంగ్రెసు నాయకుడు ప్రతిపాదించిన ప్రివిలేజ్ తీర్మానం పరిశీలనకు ఆమోదించినట్లు స్పీకర్ విక్రమ్‌కేశరీ అరూఖ్ తెలిపారు.

అస్తవ్యస్థంగా పాఠశాల నిర్వహణ



పాఠశాలకు తాళం వేసి, నిరసన వ్యక్తం చేస్తున్న అంబాగుడ గ్రామస్తులు

- ఆగ్రహంతో తాళాలు వేసిన గ్రామస్తులు

జయపురం: పాఠశాల సకాలంలో తెరవడం లేదని, విద్యా బోధనలో ఉపాధ్యాయులు నిర్లక్ష్యం వ్యవహరిస్తున్నారని కుంద్రా సమితి అసన పంచాయతీ అంబాగుడ గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తంచేశారు. దీంతో పాఠశాలకు గ్రామస్తులు తాళాలు వేయగా, సోమవారం నుంచి ఇదే పరిస్థితి కొనసాగుతోంది. విద్యాశాఖ అధికారులు వచ్చి, సమస్య పరిష్కరిస్తారని ఆశించినా, ఇప్పటి వరకు స్పందించక పోవడం గమనార్హం. పాఠశాలకు తాళాలు వేయడంతో చదువులు సాగక పోవడంతో పాటు మధ్యాహ్న భోజన పథకం సైతం నిలిచిపోయింది. దీనిపై గ్రామస్తులు మాట్లాడుతూ.. పాఠశాల సక్రమంగా తెరవడం లేదని, విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించక పోవడంపై నిరసనగా తాళాలు వేశామని తెలిపారు. విషయాన్ని సంబంధిత అధికారులకు తెలియజేసినా పట్టించుకోవడం లేదన్నారు. ఈ నేపథ్యంలో సీఆర్‌సీసీ రఘునాథ్ సాబత్, కుంద్రా సమితి ఉపాధ్యాయ సంఘం అధ్యక్షుడు త్రినాథ్ పండా, కార్యదర్శి కె.కృష్ణమోహనరావు, పాఠశాల పరిచాలన కమిటీ సభ్యుడు, జిల్లా ప్రాథమిక ఉపాధ్యాయ సంఘం అధ్యక్షుడు త్రినాథ్ హరిజన్ అక్కడికి చేరుకొని ఆందోళనకారులతో చర్చించారు. పాఠశాల కొనసాగేందుకు అవకాశం కల్పించాలని కోరారు. అధికారులు వచ్చి లిఖిత పూర్వకంగా హామీ ఇచ్చేంత వరకు తాళాలు తెరిచేది లేదని వారంతా స్పష్టంచేశారు. అయితే బుధవారం కూడా అధికారులు నుంచి స్పందన కొరవవడంతో నిరసన కొనసాగిస్తున్నారు.

శ్రామిక పెన్సన్ అదాలత్



శ్రామిక పెన్షన్ అదాలత్‌లో పాల్గొన్న అధికారులు, కార్మికులు

జయపురం: స్థానిక మున్సిపాలిటీ సభా గృహంలో పెన్సన్ అదాలత్ నిర్వహించారు. పెన్సన్ కమిషనర్ ఆదేశాల మేరకు జరిగని ఈ అదాలత్‌లో నోడల్ అధికారి అక్షయకుమార్ బెహరా పాల్గొన్నారు. జయపురం గగణాపూర్ లోని సేవా పేపరుమిల్లు 1, 2 కార్మిక సంఘాల ప్రతినిధులు, బసంతకుమార్ బెహరా నేతృత్వంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఈపీఎఫ్ పెన్షన్ అసోసియేషన్ అధ్యక్షుడు నళినీ రథ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కార్మికుల పింఛన్ సమస్యలను అధికారుల ముందుంచారు. వివిధ కారణాలతో మృతిచెందిన, రిటైర్డ్ ఉద్యోగుల కుటుంబాలకు తక్కువ పింఛన్ చెల్లిస్తున్నారని, దీనిపై చర్యలు తీసుకోవాలని కోరారు. 2012–15 ఒప్పందం ప్రకారం డీఏ, బీడీఏ బకాయిలు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. అదాలత్‌లో ప్రదీప్ పాంజియ, కేదార్ ఆచార్య, ఎస్.బిశ్వాస్‌రాయ్, జయంతశాంత, నారాయణ దాస్ తదితరులు పాల్గొన్నారు.

గుణుపూర్‌ను జిల్లాగా గుర్తించండి



పట్టణంలో ర్యాలీ నిర్వహిస్తున్న గుణుపూర్ వాసులు



సబ్ కలెక్టర్ కుహారోకు వినతిపత్రం అందిస్తున్న దృశ్యం

రాయగడ: జిల్లా పరిధిలోని గుణుపూర్‌ను జిల్లాగా గుర్తించాలని పట్టణ ప్రముఖులు డిమాండ్ చేశారు. ఈ మేరకు ముఖ్యమంత్రి పేరిట వినతిపత్రాన్ని గుణుపూర్ సబ్ కలెక్టర్ లలిత్‌కుమార్ కుహారోకు బుధవారం అందజేశారు. అంచెలంచెలుగా అభివృద్ధి చెందుతున్న గుణుపూర్‌ను జిల్లాగా గుర్తించాలని దివంగత ముఖ్యమంత్రి బిజూ పట్నాయక్ హయాం నుంచే తమ డిమాండ్‌ను వినిపిస్తున్నామని తెలిపారు. ఇటీవల రాష్ట్ర రెవెన్యూశాఖ రాష్ట్రంలో కొత్తగా 5జిల్లాల ఏర్పాటుకు సన్నాహాలు చేస్తున్న నేపథ్యంలో అందులో స్థానిక పట్టణానికి కూడా అవకాశం కల్పించాలని విన్నవించారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు బ్రహ్మానంద పట్నాయక్, ప్రముఖ పాత్రికేయుడు మిలి పాఢి నేతృత్వంలో జరిగిన ఈ ర్యాలీలో పట్టణ ప్రముఖులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని మెయిన్ రోడ్డు మీదుగా సబ్ కలెక్టర్ కార్యాలయానికి చేరుకున్నారు.

బాధ్యతలు స్వీకరించిన సీఎస్



ముఖ్యమంత్రితో భేటీ అయిన ఉన్నతాధికారులు

- అనంతరం గవర్నర్ గణేషీలాల్‌ను గౌరవ పూర్వకంగా కలిసిన ప్రదీప్ జెనా
- ఓఈఆర్‌సీ చైర్మన్‌గా సురేష్‌చంద్ర, అభివృద్ధి కమిషనర్‌గా అనూ గర్గ్



గవర్నర్ ప్రొఫెసర్ గణేషీలాల్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న సీఎస్ ప్రదీప్‌కుమార్ జెనా



రాష్ట్ర అభివృద్ధి కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరిస్తున్న అనూ గర్గ్

భువనేశ్వర్: రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా ప్రదీప్‌కుమార్ జెనా బుధవారం బాధ్యతలు స్వీకరించారు. 1989 ఐఏఎస్ బ్యాచ్‌కు చెందిన ఆయన.. ఇప్పటి వరకు ఒడిశా అభివృద్ధి కమిషనర్, ప్రత్యేక సహాయ కమిషనర్(ఎస్ఆర్‌సీ)గా బాధ్యతలు విజయవంతంగా నిర్వహించారు. సురేష్‌చంద్ర మహాపాత్రొ పదవీకాలం ఫిబ్రవరి 28తో ముగియడంతో నూతన సీఎస్‌గా నియమితులయ్యారు. గతంలో పూరీ జగన్నాథాలయం ప్రధాన పాలన అధికారి(సీఏఓ)గా, గ్రామీణ అభివృద్ధి, జల వనరులు, సాంకేతిక సమాచారం, విద్యుత్ శాఖలలో కార్యదర్శిగా కీలక బాధ్యతలు నిర్వహించారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు చేపట్టిన అనంతరం రాజ్‌భవన్‌ను సందర్శించి, గవర్నర్ ప్రొఫెసర్ గణేషీలాల్‌తో మర్యాద పూర్వకంగా భేటీ అయ్యారు. ఆయనకు పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలిపారు. అలాగే రాజ్‌భవన్‌లో జరిగిన ప్రమాణ స్వీకారోత్సవంలో ఒడిశా ఎలక్ట్రిసిటీ రెగ్యులేటరీ కమిషన్(ఓఈఆర్‌సీ) చైర్మన్‌గా సురేష్‌చంద్ర మహాపాత్రొతో గవర్నర్ గణేషీలాల్ ప్రమాణం చేయించారు. 1986 ఐఏఎస్ బ్యాచ్‌కు చెందిన ఆయన.. అంతకుముందు విద్యుత్‌శాఖ కార్యదర్శిగా, ఓపీజీసీ, ఓహెచ్‌పీసీ, ఓటీపీసీఎల్, గ్రిడ్కో సంస్థల చైర్మన్‌గా పనిచేశారు. రాష్ట్రంలో విద్యుత్ రంగం బాగోగుల పట్ల గట్టిపట్టు సాధించిన అధికారిగా ఆయన పేరొందారు.

ముఖ్యమంత్రితో భేటీ..

1991 బ్యాచ్ ఒడిశా కేడర్ ఐఏఎస్ అధికారి అనూ గర్గ్ రాష్ట్ర అభివృద్ధి కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టారు. ఆమె జలవనరుల విభాగం ప్రధాన కార్యదర్శిగా అదనపు బాధ్యతలు నిర్వహిస్తారు. కొత్త హోదాల్లో బుధవారం బాధ్యతలు స్వీకరించిన ముగ్గురు ఉన్నతాధికారులు ప్రదీప్‌జెనా, సురేష్ పాత్రొ, అను గర్గ్ ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్‌ను ఆయన నివాసంలో గౌరవ పూర్వకంగా కలిశారు.

విద్యార్థులకు ప్రవేశం ఉచితం

- మ్యూజియాల సందర్శనలో రాష్ట్రప్రభుత్వం కీలక నిర్ణయం



కటక్‌లోని మారిటైమ్ మ్యూజియం

భువనేశ్వర్: ‘రాష్ట్రం విభిన్న కళలు, సంస్కృతి పుట్టినిల్లు. కళాభూమి. మన కళలు, సంస్కృతి రాష్ట్రానికి ప్రపంచవ్యాప్తంగా పత్యేకమైన గుర్తింపు ఆవిష్కరించాయి. అమూల్యమైన రాష్ట్ర వారసత్వాన్ని పరిరక్షించి, భావి తరాల్లో ప్రతిబింబప చేయడంలో సంగ్రహాలయాలు(మ్యూజియం) ముఖ్యమైన పాత్ర పోషిస్తున్నా’యని ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ తెలిపారు. రాష్ట్రంలో మ్యూజియం లను పర్యాటకులు సందర్శించేందుకు వీలుగా మరింత ప్రాచుర్యం పొందేలా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర సాంస్కృతిక శాఖకు ఆదేశించారు. రాష్ట్రవ్యాప్తంగా ఏ మ్యూజియం ప్రవేశ రుసుము రూ.10 లకు మించకూడదని విభాగానికి బుధవారం ఆదేశాలు జారీచేశారు. అంతేకాకుండా రాష్ట్రంలోని విద్యార్థులు, చేతివృత్తుల వారు, చేనేత కార్మికులకు మ్యూజియం సందర్శన ప్రవేశానికి ఎలాంటి రుసుము వసూలు చేయరాదని స్పష్టం చేయడం విశేషం. స్థానిక స్టేట్ మ్యూజియం, ట్రైబల్ కల్చర్ అండ్ రీసెర్చ్ మ్యూజియం అత్యంత ప్రాచుర్యం సాధించాయని ఈ సందర్భంగా ఆయన తెలిపారు. కటక్ నగరంలో మారిటైమ్ మ్యూజియం విభిన్నమైనదిగా పేర్కొన్నారు. రాష్ట్రంలో మ్యూజియం లను ప్రాచుర్యంలోకి తీసుకురావడం, సందర్శకులను ఆకట్టుకునేందుకు దోహదపడుతుందని సీఎం అభిప్రాయం వ్యక్తం చేశారు. దీనికి అనుగుణంగా అన్ని మ్యూజియాలకు మార్గదర్శకాలు జారీ చేశారు.

బైక్‌ను ఢీకొన్న లారీ



లారీ చక్రాల కింద ఇరుక్కుపోయిన వాహనం

- భార్య, భర్తలకు తీవ్రగాయాలు.. ఎంకేసీజీకి తరలింపు



ఘటనా స్థలంలో గుమిగూడిన స్థానికులు

బరంపురం: నగరానికి సమీపంలోని 16వ నంబర్ జాతీయ రహదారి పుకిడిబొందొ జంక్షన్‌లో బైక్‌ను లారీ ఢీకొన్న దుర్ఘటనలో భార్యభర్తలు తీవ్ర గాయాల పాలయ్యారు. సమాచారం అందుకున్న గోపాల్‌పూర్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని క్షతగాత్రులను 108 అంబులెన్స్ సాయంతో ఎంకేసీజీ మెడికల్ కళాశాల ఆస్పత్రికి తరలించారు. ఐఐసీ అధికారి జితేంద్రకుమార్ మల్లిక్ తెలిపిన వివరాల ప్రకారం ఛత్రపూర్‌కు చెందిన భైరి అమ్మ, రఘునాథ్‌రెడ్డి భార్యభర్తలు. ఇరువురూ బైక్‌పై బుధవారం ఉదయం బరంపురం నగరానికి వస్తున్న సమయంలో ఛత్రపూర్ వైపు వెళ్తున్న లారీ ఎదురుగా వచ్చి ఢీకొంది. బైక్ లారీ చక్రాల కిందకు కూరుకుపోగా, అమ్మ, రఘునాథ్‌కు తీవ్ర గాయలయ్యాయి. విషయం తెలుసుకున్న పోలీసులు.. బాధితులను ఎంకేసీజీకి తరలించారు. అక్కడ చికిత్స అందించగా, పరిస్థితి ఆందోళనకరంగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు. పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

వ్యాన్ బోల్తా నలుగురికి గాయాలు..

మల్కన్‌గిరి: జిల్లాలోని కోరుకొండ సమితి నక్కమామిడి పంచాయతీ భయపోడ ఘాటీలో మంగళవారం అర్ధరాత్రి ఓ పికప్ వ్యాన్ బోల్తా పడింది. ఘటనలో నలుగురికి తీవ్ర గాయాలయ్యాయి. వివరాల్లోకి వెళ్తే... మల్కన్‌గిరి సమితి వీరలక్ష్మణాపూర్ గ్రామంలో మంగళవారం రాత్రి ఏర్పాటు చేసిన గిరిజన నాటకంలో పాల్గొన్న 17మంది తిరిగి స్వగ్రామానికి వ్యాన్‌లో వెళ్తున్నారు. అర్ధరాత్రి సమయంలో వాహనం అదుపుతప్పి 60అడుగుల లోయలో పడిపోయింది. ప్రమాదాన్ని గమనించిన దిదయ గ్రామస్తులు పోలీసులకు సమాచారం అందించారు. కొందరు నాట్య బృందం సభ్యులను రక్షించగా, అగ్నిమాపక సిబ్బంది పోలీసులు వాహనంలో ఇరుక్కున వారిని బయటకు తీసి కుడుములగుమ్మ ఆరోగ్య కేంద్రానికి తరలించారు. 13మందికి స్వల్ప గాయాలయ్యాయి. తీవ్ర గాయాలపాలైన నలుగురిని మల్కన్‌గిరి జిల్లా ఆస్పత్రికి తీసుకు వెళ్లారు. బాధితుల పరిస్థితి నిలకడగా ఉందని ఆరోగ్య కేంద్రం వైద్యులు సంతోష్ షడంగి తెలిపారు. పోలీసులు బుధవారం ఉదయం కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.



మల్కన్‌గిరి: ప్రమాద స్థలంలో క్షతగాత్రులు

క్లుప్తంగా

లారీ బోల్తా

● డ్రైవర్, క్లీనర్‌కు గాయాలు



కొమరాడ మలుపు వద్ద బోల్తా పడిన లారీ

కొమరాడ: మండల కేంద్రం కొమరాడ పోలీస్ స్టేషన్ సమీపంలో అంతర్రాష్ట్ర రహదారిపై ఉన్న మలుపు వద్ద బుధవారం తెల్లవారు జామున రాయగడ నుంచి పార్వతీపురం మాంగనీస్ లోడుతో వస్తున్న లారీ అదుపు తప్పి బోల్తా పడింది. దీంతో డ్రైవర్, క్లీనర్ గాయాల పాలయ్యారు. గమనించిన స్థానికులు వారిద్దరినీ పార్వతీపురం జిల్లా కేంద్రాస్పత్రికి తరలించారు. కొమరాడ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ధాన్యం దగ్ధం



కాలిపోయిన ధాన్యం బస్తాలు

సీతానగరం: మండలంలోని కేఎస్ పురంలో బుధవారం జరిగిన అగ్ని ప్రమాదంలో రూ.90 వేల విలువైన ధాన్యం దగ్ధమయ్యాయి. గ్రామానికి చెందిన రెడ్డి కాశినాయుడి ధాన్యం 60 బస్తాలు, యామల అప్పారావుకు చెందిన 45 ధాన్యం బస్తాలు, యామలప్రసాద్‌కు చెందిన 6 బస్తాల ధాన్యం కాలిపోయాయి. అలాగే మంటల్లో ఆరుగురికి చెందిన పది వరిగడ్డి కుప్పలు కాలిపోయాయి. స్థానికుల సమాచారం మేరకు బొబ్బిలి నుంచి అగ్నిమాపక శకటంతో వచ్చిన సిబ్బంది మంటలను అదుపుచేశారు. అగ్ని ప్రమాదం జరిగిందన్న సమాచారం మేరకు ఆర్ఐ కరుణాకర్, ఎస్సై కె.నీలకంఠం, వీఆర్వో ఉదయ్, సర్పంచ్ యు.జయలక్ష్మి, ఎంపీటీసీ వై.అరుణకుమారి అగ్ని ప్రమాద బాధితులను పరామర్శించారు.

కదులుతున్న రైలెక్కుతుండగా ప్రమాదం



రైలునుంచి జారిపడిన మహిళకు ప్రథమ చికిత్స చేస్తున్న 108 సిబ్బంది

విజయనగరం క్రైమ్: కదులుతున్న రైలెక్కేందుకు చేసిన ప్రయత్నంలో ఓ మహిళ జారిపడి గాయాలపాలైంది. ఈ మేరకు రైల్వే ఆర్‌పీఎఫ్ సిబ్బంది బుధవారం తెలిపిన వివరాలిలా ఉన్నాయి. విజయనగరం నుంచి విశాఖ వెళ్తున్న ఎక్స్‌ప్రెస్ కదులుతుండగా మామిడి నర్మద (24) ఎక్కేందుకు ప్రయత్నించి జారి పడిపోవడంతో ప్రమాదంలో ఎడమ చేయి, నడుము భాగం దెబ్బతిన్నాయి. ప్రమాదాన్ని గమనించిన ఆర్‌పీఎఫ్ అధికారులు సమాచారం అందించడంతో స్టేషన్‌కు వచ్చిన 108 సిబ్బంది కామేశ్వరి, పైలట్ కోటేశ్వరరావులు బాధితురాలికి ప్రథమ చికిత్స చేసి జిల్లా కేంద్రాస్పత్రికి తరలించారు.

స్కార్పియో ఢీకొని వ్యక్తి మృతి

విజయనగరం క్రైమ్: మండల పరిధిలోని గొల్లలపేట బైపాస్ రోడ్డులో బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటనకు సంబంధించి రూరల్ పోలీసులు బుధవారం తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గొల్లలపేట గ్రామపంచాయతీ పరిధిలో ఉన్న బైపాస్ రోడ్డులో చెల్లూరు నుంచి సాలూరు వైపు స్కార్పియో వాహనం వెళ్తోంది. ఎదురుగా సీడీ డీలక్స్ బైక్‌పై గొల్లలపేటకు చెందిన తండ్రీకొడుకులు, ఈగల కృష్ణ (60), రామకృష్ణలు వస్తూ రోడ్డు అవతలి వైపునున్న గొల్లలపేటకు వెళ్లేందుకు తిరుగుతున్న సమయంలో వారి బైక్‌ను స్కార్పియో బలంగా ఢీకొట్టింది. దీంతో రోడ్డుపై పడి గాయాలపాలైన తండ్రీకొడుకులను 108 సాయంతో ప్రైవేట్ ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలోనే ఈగల కృష్ణ మృతిచెందాడు. రామకృష్ణ పరిస్థితి విషమంగా ఉంది. ఈ మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ ఎస్సై బి.గణేష్ తెలిపారు.

కిమ్మి-నుడుకూరు రోడ్డుపై ఏనుగులు



కిమ్మి రోడ్డుపైకి వచ్చిన ఏనుగులు

వీరఘట్టం: గత కొన్ని రోజులుగా కిమ్మి-నడుకూరు సమీప పంట పొలాల్లో తిష్టవేసిన ఏనుగులు బుధవారం సాయంత్రం రోడ్డుపైకి చేరడంతో ప్రయాణికులు భయాందోళన చెందారు. రాకపోకలకు భయపడ్డారు. ఏనుగులను కవ్వించొద్దని అటవీశాఖ సిబ్బంది యువతను హెచ్చరించారు.

తినరా మైమరచి..



వీధుల్లో దొహిబొరా ఆలూదమ్ కోసం ఎగబాకుతున్న జనం

● నందడిగా దొహిబొరా ఆలూదమ్ దివస్

భువనేశ్వర్: రాష్ట్రంలో ఆబాల గోపాలాన్ని ఆకట్టుకునే వీధి ఆహారం దొహిబొరా ఆలూదమ్. ప్రధానంగా కటక్ నగర ప్రజల ఆవిష్కరణగా ఈ చిరు తినుబండారం పేరొందింది. కటక్ నగరవాసులు ఏటా మార్చి 1న దొహిబొరా ఆలూదమ్ దివస్‌గా పరిచయం చేశారు. గత 3 ఏళ్లుగా ఈ వేడుక జరుపుకొంటున్నారు. తొలిసారిగా 2019లో ఈ వేడుకను ప్రారంభించారు. రాష్ట్రంలో యువతరం దొహిబొరా ఆలూదమ్‌కు అత్యంత ప్రీతిపాత్రమైన చిరుతిండిగా ప్రాచుర్యం రంగరిస్తున్నారు. తొలుత కటక్ పాతబస్తీ బారబాటి సమీపం బిడానాసి ప్రాంతంలో నోరూరించే దొహిబొరాను ప్రపంచ చిరుతిండి ప్రియులకు సమర్పించిందని యువతరం గొప్పగా ప్రచారం చేస్తోంది. ఒక ఏడాది తర్వాత నోరూరించే దూదిపింజం లాంటి పెరుగు గారెకు చురచురలాడించే గుగుని(బఠాణి, బంగాళదుంపల ఇగురు కూర) జోడించి దొహిబొరా ఆలూదమ్‌గా మరింత ప్రాచుర్యం ప్రోత్సహించారు. పెరుగు గారెపై ఉల్లి తరుగు, కొత్తిమీర తురుము, దోసకాయ ముక్కల్ని చల్లి, సేవ్ జోడించడంతో సంప్రదాయ దొహిబొరా క్రమంగా దొహిబొరా ఆలూదమ్‌గా వీధుల్లో కాలక్షేప చిరుతిండిగా ప్రసిద్ధి చెందుతోంది. న్యూఢిల్లీలో జరిగిన 11వ జాతీయ వీధి తిళ్ల సంబరాల్లో కటక్ దొహిబొరా ఆలూదమ్ తొలిసారిగా అవార్డును గెలుచుకుంది. ప్రపంచంలో ఎక్కడా తారసపడని ఈ చిరుతిండికి జీఐ ట్యాగ్ ప్రదానం చేయాలని రాష్ట్ర యువతరం డిమాండ్ చేస్తోంది. ఈ ఏడాది దొహిబొరా దివస్ పురస్కరించుకుని ఈ నినాదానికి శ్రీకారం చుట్టడం విశేషం.



విక్రయానికి సిద్ధంగా ఉన్న దొహిబొరా ఆలూదమ్

బాలలూ భళా..!

● తప్పెటగుళ్ల ప్రదర్శనతో చిన్నారులు బిజీ
● పలువురి అభినందనలు
● కోమటపల్లి సాంబమూర్తి కళాక్షేత్రంలో శిక్షణ



గురువు శంకరరావుతో చిన్నారులు



అబ్బుర పరుస్తున్న చిన్నారుల తప్పెటగుళ్ల ప్రదర్శన

బొబ్బిలి రూరల్: మండలంలోని కోమటపల్లికి చెందిన చిన్నారులు అంతరించి పోతున్న పల్లెకళలను బతికిస్తూ, అందరినీ అలరిస్తున్నారు. తప్పెటగుళ్ల ప్రదర్శనలతో కోమటపల్లికి చెందిన పాఠశాల విద్యార్థులు బారు సత్యనారాయణ, నీలాపు ఉపేంద్ర, పెద్దింటి అశ్వని, కోస్గి సంధ్య, కోస్గి రాజేష్, బారు బాలాజీ, వెలమల ప్రసాద్, బొంతలకోటి పేర్నిదేవి, శిఖా పవన్, పెంట గణేష్‌లు తప్పెటగుళ్ల ప్రదర్శనలు ఇస్తూ అందరి మన్ననలు పొందుతున్నారు. ఏ గ్రామంలో సంబరాలు, జాతరలు జరిగినా ఈ చిన్నారుల ప్రదర్శన ఉండాల్సిందే అంటే అతిశయోక్తి కాదు. కోమటపల్లికి చెందిన తూర్పుభాగవతార్ బొంతలకోటి శంకరరావు తన తండ్రి జ్ఞాపకార్థం నిర్మించిన సాంబమూర్తి కళాక్షేత్రంలో పలు జానపద కళలపై ఉచితంగా శిక్షణ ఇస్తున్నారు. ఆయన దగ్గర శిక్షణ పొందిన చిన్నారుల ప్రదర్శనలు వీక్షించిన బొబ్బిలి డీఎస్పీ మోహనరావు, వైఎస్సార్ సీపీ సాంస్కృతిక విభాగం అధ్యక్షురాలు వంగపండు ఉష, పార్వతీపురం మన్యం జిల్లా అధికారులు వారిని అభినందించారు.



మన్యం జిల్లాలో సంబరాల్లో చిన్నారులు



కోమటిపల్లిలో శిక్షణ పొందుతున్న కళాకారులు

జేకే పూర్‌లో శ్రీవారి బ్రహ్మోత్సవాలు



పల్లకిలో ఊరేగుతున్న వేంకటేశ్వరస్వామి



ఉభయ దేవేరులతో పూజలందుకుంటున్న స్వామివారు

రాయగడ: పట్టణానికి సమీపంలోని జేకే పూర్‌లో ఉన్న కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయం 72వ వార్షికోత్సవం పురస్కరించుకుని బుధవారం నుంచి శ్రీవారి బ్రహ్మోత్సవాలు ప్రారంభమయ్యాయి. వేద పండితులు పొందూరు వెంకటప్రదీప్ ఆచార్యులు, రంగనాథ్ ఆచార్యులు, విశాఖపట్నానికి చెందిన అంపోలు వేణుగోపాల్ ఆచార్యుల, గోపాలకృష్ణ ఆచార్యుల పరివేక్షణలో పూజాదికాలు చేపట్టారు. ఉదయం వాస్తు యోగీశ్వర, బ్రహ్మమండల, అగ్నిప్రతిష్ట, హోమం, ధ్వజారోహణం, నీరాజన మంత్రపుష్పం తదితర కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం శ్రీదేవీ, భూదేవీ సమేతంగా స్వామి వారిని పల్లకిలో ఊరేగించగా, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని, దర్శించుకున్నారు. ఉత్సవాలు ఈనెల 3 వరకు కొనసాగుతాయని ఆలయ ప్రధానార్చకులు వెంకట్‌ప్రదీప్ తెలిపారు.

'అగ్నివీర్'పై అవగాహన



అగ్నివీర్‌పై వివరిస్తున్న రిక్రూట్‌మెంట్ అధికారి

జయపురం: దేశ సేవ చేయాలనుకునే యువతీ, యువకులు భారత సైన్యంలో చేరాలని బోర్డర్ సెక్యూరిటీ ఫోర్స్(బీఎస్ఎఫ్) అధికారులు కోరారు. అగ్నివీర్‌లో చేరేందుకు నిర్వహించనున్న ఎంపిక పరీక్షలో మహిళ, పురుషులు పాల్గొవాలని పిలుపునిచ్చారు. ఈ మేరకు జయపురం విక్రమదేవ్ కళాశాలలో విద్యార్థులకు అవగాహన శిబిరం నిర్వహించారు. బరంపురం గోలబంధు ఆర్మీ రిక్రూట్‌మెంట్ అధికారి(ఏఆర్‌ఓ) సుభేదార్ మేజర్ సంజీవ్‌కుమార్, హవాల్దార్ ఇందిరా సింగ్, ప్రదీప్ మల్లిక్ ఇందులో పాల్గొని.. మాట్లాడారు. అగ్నివీర్ సాధారణ విధులు, మహిళా మిలటరీ పోలీసు యుద్ధ విభాగం, స్టోర్ విభాగం, ట్రేడ్స్‌మన్, మెస్ కీపర్, హౌస్ కీపర్ తదితర విభాగాల్లో ఖాళీలను భర్తీ చేయనున్నట్లు తెలిపారు. దీనికి కావాల్సిన వయస్సు, ఎత్తు, విద్యార్హతలను వివరించారు. ఎన్‌సీసీ క్యాడెట్లు, ఆటలు, కళల్లో రాణించిన వారికి ప్రత్యేక కోటా వర్తింపజేయనున్నట్లు ప్రకటించారు. కార్యక్రమంలో విక్రమదేవ్ కళాశాల ఎన్‌సీసీ అధికారి లెఫ్టినెంట్ డాక్టర్ లక్ష్మణపాత్రొ, అల్యుమినా నిశాన్ పట్నాయక్, 70 మంది ఎన్‌సీసీ క్యాడెట్లు పాల్గొన్నారు.



అవగాహన శిబిరంలో పాల్గొన్న విద్యార్థులు

అటవీశాఖకు ఆదాయం

విజయనగరం ఫూల్‌బాగ్: ప్రభుత్వం ఆధ్వర్యంలో ప్రభుత్వ స్థలాల్లో 60 ఏళ్ల క్రితం నాటిన టేకుచెట్లను నరికి అటవీశాఖ ఆధ్వర్యంలో అమ్మకాలు చేపట్టడం ద్వారా ప్రభుత్వానికి ఆదాయం సమకూరుతోంది. గడిచిన 1957,1959,1960వ సంవత్సరాల్లో జిల్లాలోని గంటికొండ ప్రాంతంలో నాటిన మొక్కలకు ఈ దశాబ్దానికి 60 ఏళ్ల పూర్తికావడంతో 2,026 చెట్ల అమ్మకాల ద్వారా ఆదాయం వస్తోంది. అలాగే ఈ ఏడాదితో 60 సంవత్సరాలు పూర్తయిన 313 చెట్ల కటింగ్‌కు అనుమతి ఇచ్చారు. వాటి ద్వారా సుమారు 80 సీఎంటీల కలప వచ్చింది. ఈ కలప ఈ నెల 8,20 తేదీల్లో వేలం పాటద్వారా అమ్మకాలు చేపతారు. ఆసక్తిగలవారు అందులో పాల్గొన వచ్చునని అటవీ అధికారులు చెబుతున్నారు.



జిల్లా అటవీశాఖ కార్యాలయ ప్రాంగణంలో వేలంపాటకు సిద్ధంగా ఉన్న టేకు లాట్లు

నిఘా నీడలో పరీక్షలు



కళ్లికోట్ విశ్వవిద్యాలయంలో ప్లస్2 పరీక్షలు రాస్తున్న విద్యార్థులు

● ప్లస్2 వార్షిక పరీక్షలు ప్రారంభం

బరంపురం: రాష్ట్రవ్యాప్తంగా ప్లస్2 వార్షిక పరీక్షలు ఉన్నత విద్యాశాఖ, ఇంటర్ బోర్డు ఆధర్యంలో బుధవారం నుంచి ప్రారంభమయ్యాయి. 2022-23 విద్యా సంవత్సరానికి సంబంధించి సుమారు 42,814 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారు. ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు జరగనున్నట్లు బరంపురం ఉన్నత విద్యాశాఖ కార్యదర్శి డాక్టర్ కులమణి తెలిపారు. దీనికోసం జిల్లావ్యాప్తంగా 72 కేంద్రాలు, 16 పరీక్షల నిర్వహణ హబ్‌లు తెరిచామన్నారు. ఇందులో ఆర్ట్స్, సైన్స్, కామర్స్, ఇతర విభాగాలకు చెందిన మంది విద్యార్థులు పాల్గొన్నారని వెల్లడించారు. అలాగే మాస్ కాపీయింగ్‌కు ఎటువంటి అవకాశం లేకుండా కేంద్రాల వద్ద ప్రత్యేకంగా సీసీ కెమెరాలు అమర్చినట్లు వివరించారు.

జయపురంలో 1841మంది హాజరు..

జయపురం: రాష్ట్ర ఉన్నత విద్యాశాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ప్లస్2 పరీక్షలు జయపురంలో కట్టుదిట్టంగా ప్రారంభమయ్యాయి. 4 కేంద్రాల్లో జరిగిన పరీక్షలకు వివిధ కళాశాలకు చెందిన 1,841మంది విద్యార్థులు హాజరయ్యారు. ఇందులో వీడీ కళాశాలకు చెందని 1329మంది, రోయల్ జూనియర్ కళాశాల నుంచి 93మంది, ప్రభుత్వ మహిళా కళాశాలకు చెందిన 110మంది ఉన్నారు. ఉదయం 9 గంటలకే అభ్యర్థులు కేంద్రాలకు చేరుకోవడంతో సందడి వాతావరణం కనిపించింది. ప్రతీ విద్యార్థినీ నిశితంగా తనిఖీ చేసి, లోపలికి పంపించారు. విక్రమదేవ్ కళాశాలలో 5 గదులు కేటాయించగా, ప్రతి హాలు వద్ద సీసీ టీవీ లను అమర్చారు.



పరీక్షా కేంద్రాల్లో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు



జయపురం: వీడీ కళాశాలలో పరీక్ష రాసేందుకు వెళ్తున్న విద్యార్థులు

బ్లేడ్‌తో కోసుకుని ఆత్మహత్యాయత్నం

పార్వతీపురం: కుమారుడు మద్యం తాగడానికి డబ్బులు ఇవ్వలేదని మనస్తాపం చెందిన ఓ తండ్రి బ్లేడుతో కోసుకుంటానని బెదిరించి ఆత్మహత్యాయత్నం చేశాడు. బుధవారం జరిగిన ఈ సంఘటనపై పార్వతీపురం ఔట్‌పోస్టు పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గరుగుబిల్లి మండలం రావుపల్లి గ్రామానికి చెందిన బొంతాడ ఆదినారాయణ.. మద్యం తాగడానికి కుమారుడు సింహాచలాన్ని డబ్బులు అడిగాడు. కుమారుడు డబ్బులు ఇవ్వకపోవడంతో తాను తీసుకువచ్చిన బ్లేడ్‌తో మెడ మీద కోసుకుంటానని బెదిరించి కోసుకుని గాయాలపాలయ్యాడు. స్థానికులు గరుగుబిల్లి పీహెచ్‌సీకి చికిత్స నిమిత్తం తీసుకువెళ్లి ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం పార్వతీపురం జిల్లా ఆస్పత్రికి 108 వాహనంలో తరలించారు.

మాతాశిశు సంరక్షణకు

కిల్కారీ సేవలు



శిక్షణ పొందుతున్న ఏఎన్ఎం, ఆశవర్కర్లు

● గర్భిణులు, బాలింతలు, పిల్లల ఆరోగ్యంపై ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ
● కిల్కారీ సేవలకు శ్రీకారం
● వైద్య సిబ్బందికి శిక్షణ
● జిల్లాలో 13,326 మంది గర్భిణుల వివరాల నమోదు

పార్వతీపురంటౌన్:

మాతాశిశు సంరక్షణపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నాయి. గర్భిణులు, బాలింతలకు ఆరోగ్య జాగ్రత్తలు వివరిస్తున్నాయి. పౌష్టికాహారం అందిస్తున్నాయి. పిల్లల సంరక్షణపై ప్రత్యేక తర్ఫీదునిస్తున్నాయి. తాజాగా కిల్కారీ పేరుతో కేంద్ర ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ సరికొత్త కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. కిల్కారీ అనేది హెల్త్ మొబైల్ ఎడ్యుకేషన్ సర్వీస్. గర్భిణులు, బాలింతలు, ప్రసూతి వివరాలను యాప్‌లో పొందుపరచాలి. ఆ వివరాల మేరకు ఆరోగ్య జాగ్రత్తలు, వైద్య పరీక్షల వివరాలను తెలుసుకుంటూ సకాలంలో సరైన సూచనలు ఇస్తారు. ఈ విధానంపై ఆరోగ్య, ఆశ కార్యకర్తలకు జిల్లా వైద్యశాఖ అధికారులు శిక్షణ ఇచ్చారు. ఇంటింటి సర్వే చేసి గర్భిణుల వివరాల నమోదును పూర్తిచేయించారు.

మీ ఆరోగ్యం ఎలా ఉంది...?

హలో.. అక్కా నేను మీ డాక్టర్‌ను మాట్లాడుతున్నాను. మీ ఆరోగ్యం ఎలా ఉంది? అనే ఆప్యాయమైన పలకరింపుతో గర్భిణులు, బాలింతలకు ఫోన్లు చేస్తారు. గర్భిణులు, బాలింతలు ఆరోగ్య కార్యకర్తలు, ఆశవర్కర్ల వద్దకు వెళితే పేరు, వయసు, ఇంటి చిరునామా, సెల్‌ఫోన్ నంబర్, ప్రసవ తేదీ అంచనా వంటి వివరాలను ప్రభుత్వ ఆర్సీహెచ్ రిజిస్టర్‌లో నమోదు చేస్తారు. గర్భిణిగా నాలుగో నెల ప్రారంభం నుంచి కిల్కారీ సేవలు (ప్రతి తల్లీ ఆరోగ్య స్వీయ ఆరోగ్యసేవ) ప్రారంభమవుతాయి. గర్భిణి చెప్పే సమాధానాల ఆధారంగా ఆరోగ్య సమాచారాన్ని సేకరిస్తారు. కరోనా సమయంలోను తర్వాత తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సరైన అవగాహన లేక కొన్ని చోట్ల మాతృమరణాలు సంభవించాయి. మరికొందరు పౌష్టికాహారం, రక్తహీనత లోపాలతో మృత్యువాత పడుతున్నారు. ఇకపై ఇలాంటి సమస్యలకు చెక్ పెడుతూ ప్రభుత్వం ఈ విధానాన్ని అమలులోకి తెచ్చింది.

72 వారాల పాటు సేవలు

గర్భిణిగా నమోదైన రెండో త్రైమాసికం నుంచి పిల్లలు పుట్టిన ఏడాది వరకూ ఏయే వారంలో ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో వివరించే ఆరోగ్య సమాచారంతో 72 వారాల పాటు వారానికి ఒక ఆడియో చొప్పున వాయిస్ రూపంలో అందుబాటులోకి తీసుకువచ్చారు. దీనివల్ల ఆరోగ్య జాగ్రత్తలపై సంపూర్ణ అవగాహన కలుగుతుంది. ఫలితంగా మాతా, శిశు మరణాలు తగ్గడంతో పాటు సురక్షిత ప్రసవాలకు అవకాశం ఉంటుంది.

జిల్లాలో 13,326 మంది గర్భిణుల వివరాల నమోదు

జిల్లాలో 13,326 మంది గర్భిణుల వివరాలను యాప్‌లో నమోదుచేశారు.. గర్భిణుల పూర్తి వివరాలు కిల్కారీ లో నమోదు చేయడానికి 365 ఏఎన్ఎంలు, 1540 ఆశ వర్కర్లు పూర్తిస్థాయిలో శిక్షణ పొందారు. ఎప్పటికప్పుడు గర్భిణుల ఆరోగ్య పరిస్థితి తెలుసుకుని వారికి అవసరమైన సూచనలు సలహాలు అందజేస్తున్నారు.

గర్భిణిగా నిర్ధారణ అయినపుడే..



గర్భిణిగా నమోదైనపుడే వారి ఫోన్ నంబర్ తీసుకుంటారు. వారికి నేరుగా మహిళా డాక్టర్ నుంచి ఫోన్ వస్తుంది. తమకు అందిన వివరాల ప్రకారం తీసుకోవాల్సిన జాగ్రత్తలు, చేయించుకోవాల్సిన వైద్యం గురించి వివరిస్తారు. డాక్టర్ ఫోన్ చేసినపుడు గర్భిణి మాట్లాడడం కుదరకపోతే తిరిగి అదే నంబర్‌కు గర్భిణి ఫోన్ చేసి వివరాలు తెలుసుకునేలా ఈ విధానాన్ని రూపొందించారు. గర్భిణికి ఆండ్రాయిడ్ ఫోనే కాదు కీ ప్యాడ్ ఫోన్ ఉన్నా సరిపోతుంది.
– డాక్టర్, బి.జగన్నాథరావు, జిల్లా వైద్యారోగ్యశాఖాధిరి, పార్వతీపురం మన్యం

క్లుప్తంగా

గుర్తు తెలియని మృతదేహం గుర్తింపు


గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

లావేరు: బుడుమూరు గ్రామం వద్ద గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని గుర్తించినట్టు లావేరు పోలీసులు బుధవారం తెలిపారు. హెడ్‌కానిస్టేబుల్ రామారావు తెలిపిన వివరాల ప్రకారం.. మంగళవారం అర్ధరాత్రి తమ సిబ్బంది గస్తీ తిరుగుతుండగా బుడుమూరు గ్రామం వద్ద ఉన్న ఫ్లైఓవర్ కిందన గల సర్వీసు రోడ్డులో మృతదేహం ఉండటాన్ని గుర్తించినట్టు చెప్పారు. విషయం ఉన్నతాధికారులకు చేరడంతో ఎస్సై కోటేశ్వరరావు సంఘటనా స్థలానికి వెళ్లి మృతదేహాన్ని పరిశీలించారు. మృతుని వద్ద విశాఖపట్నం నుంచి రాజాంకు వెళ్లే బస్సు టిక్కెట్టు మాత్రమే ఉన్నట్టు చెప్పారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం శ్రీకాకుళంలోని రిమ్స్ ఆస్పత్రికి తరలించారు. ఎస్సై కోటేశ్వరరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

'ఆఫ్‌షోర్' పనులు పునః ప్రారంభం


ఆఫ్‌షోర్ పనుల కోసం సిద్ధంగా ఉన్న వాహనాలు

మెళియాపుట్టి: కొద్ది రోజులుగా నిలిచిపోయిన ఆఫ్‌షోర్ రిజర్వాయర్ పనులు బుధవారం పునః ప్రారంభమయ్యాయి. జిల్లా కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్ ఇటీవల నిలిచిపోయిన పనులను సందర్శించారు. ఈ సందర్భంగా త్వరలోనే పనులు ప్రారంభిస్తామని ప్రకటించారు. ఆయన చెప్పిన ప్రకారమే పనులు ఆరంభమయ్యాయి. రేగులపాడు వద్ద పనులకు శ్రీకారం చుట్టారు. మండలంలోని చీపురుపల్లికి చెందిన ఆఫ్‌షోర్ నిర్వాసితులకు ప్రభుత్వం అన్నివిధాలా అండగా నిలచింది. కొన్ని సమస్యలను సబ్‌కలెక్టర్ దృష్టి నిర్వాసితులు గతంలో తీసుకెళ్లగా వాటిని కూడా పరిష్కరిస్తామన్నారు. అడ్డంకులన్నీ తొలగి పనులు తిరిగి ప్రారంభమయ్యాయి.

31వ తేదీలోగా పన్నులు చెల్లించాలి

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ముగియనున్న నేపథ్యంలో ఈ నెలాఖరులోగా ఇంటి, కుళాయి, ఖాళీ స్థలం, ట్రేడ్ లైసెన్సుల ప్రకటనలు, టెంపరరీ ఎంక్రోచ్‌మెంట్ పన్నులు చెల్లించాలని శ్రీకాకుళం నగరపాలకసంస్థ కమిషనర్ చల్లా ఓబులేసు ఆదేశించారు. ఈమేరకు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. గడువులోగా పన్నులు చెల్లించకుంటే 24 శాతం అపరాధ రుసుంతో కట్టాల్సి ఉంటుందని పేర్కొన్నారు. ఇటీవల నగర పాలకసంస్థలో విలీనమైన పెద్దపాడు, చాపురం, కిల్లిపాలెం, ఖాజీపేట, తోటపాలెం, కుశాలపురం, పాత్రునివలస ప్రజలు కూడా పన్నులు చెల్లించాలని కోరారు. సమీపంలో ఉన్న సచివాలయాలతోపాటు కార్పొరేషన్ కార్యాలయంలో పన్నులు చెల్లించుకోవచ్చునన్నారు.

4న కిడ్నీ వైద్య శిబిరం

వజ్రపుకొత్తూరు రూరల్: ఉద్దాన ప్రాంతాన్ని పట్టి పీడిస్తున్న కిడ్నీవ్యాధి నివారణ చర్యలలో భాగంగా ఈ నెల 4న అక్కుపల్లి, గోవిందపురం పీహెచ్‌సీ పరిధిలో నిర్వహించనున్న వైద్య శిబిరాన్ని విజయవంతం చేయాలని తహశీల్దార్ బి.అప్పలస్వామి బుధవారం ఒక ప్రకటనలో కోరారు. అదే రోజు ఉదయం 9.30 గంటలకు న్యాయ విజ్ఞాన సదస్సు జరుగుతుందని పేర్కొన్నారు. జిల్లా జడ్జి, డీఎంఅండ్‌హెచ్‌ఓ ఆధ్వర్యంలో జరిగే ఈ కార్యక్రమాల్లో సంబంధిత అధికారులు, వైద్య సిబ్బంది, ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

నేడు శ్రీముఖలింగేశ్వరుని హుండీ ఆదాయం లెక్కింపు

జలుమూరు: ప్రసిద్ధ శైవక్షేత్రం శ్రీముఖలింగేశ్వరుని శివరాత్రి ఉత్సవాలు అనంతరం హుండీ ఆదాయాన్ని గురువారం ఉదయం లెక్కించనున్నారు. ఈ మేరకు ఆలయ ఈఓ పి.ప్రభాకరరావు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. గ్రామ పెద్ద సమక్షంలో జరిగే హుండీ కానుకల లెక్కింపులో భక్తులు పాల్గొనాలని కోరారు.

దివ్యక్షేత్రం అరసవల్లి


అనుగ్రహభాషణం చేస్తున్న సత్యాత్మ తీర్థ స్వామీజీ

అరసవల్లి: దేశంలోనే సూర్యునికి నిత్య పూజలు చేస్తున్న అరసవల్లి సూర్యక్షేత్రం ఓ దివ్య క్షేత్రమని బెంగళూరుకు చెందిన జగద్గురు మాధవాచార్య మూల మహా సంస్థానం ఉత్తరాది మఠాధిపతి సత్యాత్మ తీర్థ స్వామీజీ అన్నారు. బుధవారం సూర్యనారాయణ స్వామిని దర్శించుకున్నారు. ఆలయ ప్రధానార్చకులు ఇప్పిలి శంకరశర్మ సంప్రదాయ స్వాగతం పలికి అంతరాలయ దర్శనం చేయించారు. అనంతరం అనివెట్టి మండపంలో భక్తులనుద్దేశించి అనుగ్రహభాషణం చేశారు. గ్రహాధిపతిగా సూర్యుడు కొలువు తీరడం ఇక్కడి వారి అదృష్టమని.. పూజా విధానం అద్భుతమని కొనియాడారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ కె.వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

మండే ఎండకు అండ 'దోస'

- పెరుగుతున్న ఎండలు.. దోసకాయలకు డిమాండ్
- జిల్లాలోని పలు గ్రామాల్లో సాగు చేస్తున్న రైతులు
- ఇతర జిల్లాలకు ఎగుమతి చేస్తున్న వైనం


రొట్టవలసలో రైతులు సాగుచేస్తున్న దోసపంట

ఆమదాలవలస రూరల్/సరుబుజ్జిలి: వేసవి తాపం పెరుగుతుండడంతో చల్లని పానీయాల కోసం జనం ఎగబడుతున్నారు. అయితే ఎన్ని పానీయాలు తాగినా ఎండ తీవ్రతకు దాహం తీరదు. దీంతో జిల్లాలోని వివిధ గ్రామాల్లో సాగు చేస్తున్న దోసకాయలను తినేందుకు ఆసక్తి చూపిస్తున్నారు. లేత దోస కాయలను తింటే ఎండ నుంచి ఉపశమనం పొందడమే కాకుండా మెరుగైన ఆరోగ్యం సాధ్యమంటున్నారు. జిల్లాలో సాగు చేస్తున్న దోస కాయలకు డిమాండ్ అధికంగా ఉంది.

జిల్లాలో పరిస్థితి..

ఆమదాలవలస మండలంలోని మునగవలస, జొన్నవలస, సరుబుజ్జిలి మండలంలోని రొట్టవలస, అవతారాబాద్, కొత్తకోట గ్రామాల రైతులు దోసకాయ పంటను అధికంగా సాగు చేస్తున్నారు. ఏటా రబీ సాగులో భాగంగా సుమారు 500 ఎకరాల్లో దీన్ని సాగు చేస్తారు. సైజును బట్టీ ఒక్కో కాయను రూ. 10 నుంచి 30 రూపాయల వరకు, కిలో రూ. 50 చొప్పున రైతులు విక్రయిస్తున్నారు. మునగవలస, రొట్టవలస గ్రామాల వద్ద దోసకాయలను ఇతర జిల్లాలకు చెందిన ప్రయాణికులతో పాటు ఒడిశా రాష్ట్రానికి చెందిన వారు ఎక్కువగా కొనుగోలు చేస్తున్నారు.

ఇతర ప్రాంతాలకు ఎగుమతి

దోస కాయలకు డిమాండ్ ఉండడంతో ఇతర ప్రాంతాలకు కూడా రైతులు ఎగుమతి చేస్తున్నారు. శ్రీకాకుళం జిల్లా కేంద్రంతోపాటు విజయనగరం, విశాఖపట్నం, తూర్పుగోదావరి జిల్లాలకు, ఒడిశాలోని వివిధ ప్రాంతాలకు వ్యాన్‌లు, ఆటోల ద్వారా తీసుకెళ్లి విక్రయిస్తున్నారు.


అమ్మకానికి సిద్ధంగా ఉన్న దోసకాయలు

ఆరోగ్య పోషకాలు

వేసవి నేస్తాలుగా పేరుపొందిన రొట్టవలస దోసకాయలో పోషకాలు మెండుగా ఉంటాయి. వీటిని తినడం వలన శరీరంలోని జీర్ణ ప్రక్రియగా బాగా పనిచేస్తుంది. కూరగా కూడా దీన్ని వండుకోవచ్చు.

సాగు సులభం

రబీ సీజన్‌లో దోస పంటను సాగు చేయడం చాలా సులువు. విత్తనాన్ని కూడా సొంతంగానే సమకూర్చుకుని సాగు చేస్తున్నాం. ప్రస్తుత మార్కెట్‌లో దోస కాయలకు మంచి గిరాకీ ఉంది. తక్కువ ఖర్చుతో పంటను సాగు చేసి ఎక్కువ లాభం పొందవచ్చు.

– తూలుగు గోవిందరావు, రైతు, రొట్టవలస, సరుబుజ్జిలి మండలం

దోస సాగు లాభదాయకం



దోస సాగు ఎంతో లాభదాయకం. తక్కువ ఖర్చుతో ఎక్కువ దిగుబడులు సాధించడానికి అవకాశం ఉంది. పెద్దగా పెట్టుబడి కూడా అవసరం లేదు. సాగు నీరు సకాలంలో అందిస్తే అధిక దిగుబడి సాధ్యం.

– మెట్ట మోహనరావు, మండల వ్యవసాయాధికారి, ఆమదాలవలస

ఉద్దానం ఆరాధ్యుడు.. వల్లభనారాయణుడు..


భక్తులు ఆరాధించే రట్టివల్లభనారాయణస్వామి


భక్తులను ఆకట్టుకునే స్వామివారి ఆలయం

- మహావిష్ణువు మత్స్యవతారంగా భక్తుల నమ్మకం
- 18వ శతాబ్దంలో వెలసిన నారాయణ స్వామి
- నేటి నుంచి స్వామి డోలోత్సవాలు

మందస: పచ్చని తోటల మధ్య వెలసిన ఉద్దాన సుందర ఆరాధ్య దేవుడే వల్లభనారాయణస్వామి. 18వ శతాబ్దంలో వెలసినట్టు చరిత్ర చెబుతుండగా, స్వామివారి డోలోత్సవాలు శోభాయమానంగా జరుగుతాయి. మందస మండలంలోని ఉద్దాన గ్రామమైన రట్టిలో వల్లభనారాయణుని డోలోత్సవాన్ని ఈ నెల రెండు నుంచి ఏడో తేదీ వరకు వైభవంగా నిర్వహించేందుకు దేవదాయశాఖ అధికారులు, కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేశారు. ఐదు రోజులు యాత్ర జరుగుతున్నప్పటికీ, మూడు రోజుల పాటు భక్తులు భారీ ఎత్తున తరలివస్తారు. పలాస ఆర్టీసీ డిపో అధికారులు రట్టి జాతర పేరిట ప్రత్యేక బస్సులు నడుపుతుంది.

సముద్ర తీరాన..

సముద్ర తీర ప్రాంతాన అందమైన కొబ్బరి తోటల వద్ద ఆహ్లాదకరమైన వాతావరణంలో ఉన్న రట్టి గ్రామంలో వల్లభనారాయణస్వామి ఆలయం ఉంది. రాచరిక పాలన నుంచి ఏటా శివరాత్రి 12 రోజుల తరువాత స్వామి వారి డోలోత్సవాలను నిర్వహించడం పరిపాటి. అందులో భాగంగానే గురువారం నుంచి 7వ తేదీ వరకు స్వామి డోలోత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నారు. సింహాచలం పుణ్యక్షేత్రంలో వెలసిన సింహాద్రి అప్పన్న, రట్టిలో వెలసిన వల్లభనారాయణస్వామిని ఒక్కటిగా భక్తులు చెబుతుంటారు. ఉత్సవాల సందర్భంగా జిల్లాలోని మారుమూల ప్రాంతాలతోపాటు ఒడిశా రాష్ట్రం నుంచి కూడా అధికసంఖ్యలో భక్త జనులు స్వామి వారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకుంటారు.

కార్యక్రమ వివరాలివే...

డోలోత్సవాలు దేవదాయశాఖ ఆధ్వర్యంలో వివేకానంద యువజన సేవాసంఘం సేవా సహకారాలతో ప్రారంభమవుతాయి. గురువారం రాత్రి తొమ్మిది గంటలకు అంకురార్పణ చేస్తారు. మూడున ఏకాదశి సందర్భంగా పంచామృత అభిషేకాలు, ప్రత్యేక పూజలు, 4న ధ్వజారోహణ, విశేష హోమములు, 5న తిరువీధి, భక్తుల దర్శనార్థం స్వామిని ఆలయం నుంచి మండపంపై ఉంచుట, 6న మఖా కామదహనం, 7న డోలో పౌర్ణమి, సముద్రస్నానం, కోలసేవ జరుగుతుంది.

పలాస డిపో నుంచి ప్రత్యేక బస్సులు

రట్టి వల్లభనారాయణస్వామి యాత్రకు పలాస ఆర్టీసీ డిపో నుంచి ప్రత్యేకంగా బస్సులు నడుపుతారు. 5, 6, 7 తేదీల్లో పలాస–హరిపురం–రట్టి, మందస–హరిపురం–రట్టి, సోంపేట–హరిపురం–రట్టిలను కలుపుతూ 20 బస్సులను రట్టి యాత్ర స్పెషల్ పేరుతో బస్సులు తిరుగుతాయి.

పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికకు ఓటరు స్లిప్పులు సిద్ధం


ఓటరు స్లిప్పుల తయారీలో నిమగ్నమైన సిబ్బంది

శ్రీకాకుళం రూరల్: ఈనెల 13వ తేదీన జరగనున్న పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికకు సంబంధించి ఓటర్ స్లిప్పులను తయారు చేసే పనిలో శ్రీకాకుళం మండల తహసీల్దార్ కార్యాలయ సిబ్బంది నిమగ్నమయ్యారు. మండల పరిధిలో 10,743 పట్టభద్రుల ఓటర్లు నమోదైనట్లు తహసీల్దార్ ఎన్.వెంకట్రావు తెలిపారు. శుక్రవారం నుంచి గ్రామాల్లోని ఓటర్లకు వీఆర్వోలు ఓటరు స్లిప్పులను అందించనున్నారు. శ్రీకాకుళం రూరల్ మండలానికి సంబంధించిన పట్టభద్రులంతా నగరంలోని పి.ఎస్.ఎన్.ఎం.స్కూల్లోని పోలింగ్ కేంద్రాల్లో ఓటు హక్కును వినియోగించుకోవాల్సి ఉంటుందన్నారు. అలాగే శ్రీకాకుళం అర్బన్ ప్రాంతానికి చెందిన వారు ఆర్ట్స్ కళాశాల, జూనియర్ కళాశాల్లోను, టి.పి.ఎం.స్కూల్, ఎన్‌టిఆర్ మున్సిపల్ స్కూల్లో ఏర్పాటు చేసిన కేంద్రాల్లో ఓటు హక్కును వినియోగించు కోవచ్చునన్నారు.

ర్యాగింగ్‌కు పాల్పడితే కఠిన చర్యలు

శ్రీకాకుళం రూరల్: ర్యాగింగ్‌కు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని డెంటల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా మెంబర్ డాక్టర్ షేక్ మహబూబ్ బాషా అన్నారు. పాత్రునివలసలోని శ్రీ సాయి డెంటల్ కళాశాలలో బుధవారం యాంటీ ర్యాగింగ్‌పై మొదటి సంవత్సరం విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైద్య వృత్తిని ఎంచుకున్న విద్యార్థులు తోటివారితో సోదరి, సోదరభావంతో మెలగాలన్నారు. ర్యాగింగ్‌కు పాల్పడితే జీవితాలు ఛిన్నాభిన్నమవుతాయని, జైలు పాలయ్యే అవకాశాలూ ఉంటాయని హెచ్చరించారు. మానవ సమాజంలో ప్రతి ఒక్కరికీ సేవచేసే అదృష్టం ఒక్క వైద్య వృత్తి చేస్తున్న వారికే ఉందన్నారు. విద్యార్థులంతా కలిసికట్టుగా ఉంటూ ర్యాగింగ్ భూతాన్ని తరిమికొట్టాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి.కృష్ణప్రసాద్, వివిధ విభాగాధిపతులు పాల్గొన్నారు.

హక్కులపై అవగాహన అవసరం

శ్రీకాకుళం పాతబస్టాండ్: కేసు విచారణలో ముద్దాయి హక్కులపై న్యాయవాదులకు పూర్తిస్థాయిలో అవగాహన ఉండాలని, విచారణలో ప్రతి అంశం కీలకమని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి ఆర్.సన్యాసినాయుడు అన్నారు. బుధవారం జిల్లా న్యాయ సేవాధికారుల సంస్థ కార్యాలయంలోని న్యాయ సేవాసదన్‌లో అంబేడ్కర్ యూనివర్సిటీకి చెందిన లా కాలేజీ విద్యార్థులకు పోక్సో, విక్టిం కాంపెన్సేషన్ స్కీం, అరెస్టు, ప్రీ అరెస్టు, రిమాండ్, ముద్దాయిల హక్కుల న్యాయ అవగాహన సదస్సు నిర్వహించారు. రిసోర్స్ పర్సన్ అన్నెపు భువనేశ్వరరావు విద్యార్థుల సందేహాలను నివృత్తి చేశారు. కార్యక్రమంలో లా కాలేజీ ప్రొఫెసర్ సుజాత పాల్గొన్నారు.

జన జాతర

పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలోని పలాస కాపువీధిలో బుధవారం జరిగిన ఎల్లమ్మ తల్లి జాతరకు జనం భారీగా తరలివచ్చారు. ఆంధ్రా–ఒడిశా సరిహద్దు గ్రామాలతో పాటు చుట్టుపక్కల మండలాల నుంచి సుమారు లక్ష మంది భక్తులు తరలివచ్చి ఎల్లమ్మను దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. – కాశీబుగ్గ





సత్యవరం..జనసంద్రం



సత్యవరం గ్రామంలో నాలుగు రోజులుగా నిర్వహిస్తున్న పాదాలమ్మ తల్లి సిరిమాను మహోత్సవం బుధవారంతో ముగిసింది. చివరి రోజున విందు భోజనాలకు గ్రామానికి చెందిన వారి కుటుంబ సభ్యులు, స్నేహితులు భారీగా తరలిరావడంతో సత్యవరం వీధులన్నీ జన సంద్రంగా మారాయి. జాతీయ రహదారి కూడలి నుంచి గ్రామంలోకి వెళ్లే దారులన్నీ జనాలతో కిటకిటలాడాయి. నరసన్నపేట పోలీసులు బందోబస్తు నిర్వహించడంతో ట్రాఫిక్ సమస్యలు తలెత్తలేదు. మహోత్సవాలు సజావుగా, ప్రశాంతంగా పూర్తి కావడంతో ఉత్సవ కమిటీ ఊపిరి పీల్చుకుంది. కమిటీ ప్రతినిధి, ఎంపీపీ ఆరంగి మురళి అందరికీ కృతజ్ఞతలు తెలియజేశారు.

-నరసన్నపేట

విద్యార్థులు క్రీడా స్ఫూర్తిని చాటాలి


వాలీబాల్ పోటీలో గెలుపొందిన నైరా విద్యార్థులతో కళాశాల ప్రతినిధులు

శ్రీకాకుళం రూరల్: ప్రతి విద్యార్థి క్రీడా స్ఫూర్తిని చాటాలని ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విద్యాలయం డీన్ ఆఫ్ స్టూడెంట్ అఫైర్స్ పి.సాంబశివరావు అన్నారు. విద్యార్థులు నాయకత్వ లక్షణాలను కలిగి ఉండాలన్నారు. శ్రీకాకుళంలోని ఆచార్య ఎన్‌జీ రంగా విశ్వవిద్యాలయం నైరా వ్యవసాయ కళాశాలలో వ్యవసాయ పాలిటెక్నిక్ కళాశాలల విద్యార్థుల రాష్ట్రస్థాయి క్రీడలు, సాంస్కృతిక పోటీలు బుధవారం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. క్రీడలు మానసిక ఉల్లాసానికి దోహదం చేస్తాయన్నారు. ప్రతి విద్యార్థి క్రీడల్లో పాల్గొనాలని సూచించారు. అలాగే గెలుపోటములను సమానంగా స్వీకరించాలని, ఓటమి చెందామని నిరుత్సాహ పడరాదన్నారు. డైరెక్టర్ ఆఫ్ పాలిటెక్నిక్ డాక్టర్ ఎం.శ్రీరేఖ మాట్లాడుతూ.. విద్యార్థుల్లో మానవ సంబంధాలు మెరుగుపడడానికి క్రీడాస్ఫూర్తి, క్రమశిక్షణ, నాయకత్వ లక్షణాలను అలవర్చుకోవాలన్నారు. అసోసియేట్ డైరెక్టర్ డి.శ్రీనివాస్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో 21 కళాశాలల నుంచి 420 మంది విద్యార్థులు పాల్గొన్నారు. విద్యార్థుల మార్చ్‌ఫాస్ట్ ఆకట్టుకుంది.


మాట్లాడుతున్న సాంబశివరావు

ఎన్‌ఈపీ సదస్సును విజయవంతం చేయండి


మాట్లాడుతున్న కళాశాల ప్రిన్సిపాల్, సెమినార్ కన్వీనర్ శ్రీరాములు

శ్రీకాకుళం న్యూకాలనీ: జాతీయ విద్యా విధానంపై శ్రీకాకుళం జిల్లా వేదికగా తొలిసారిగా నిర్వహిస్తున్న జాతీయస్థాయి సదస్సును విజయవంతం చేయాలని శ్రీకాకుళం ప్రభుత్వ మహిళా డిగ్రీ (అటానమస్) కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కణితి శ్రీరాములు కోరారు. జాతీయ విద్యా విధానం (నేషనల్ ఎడ్యుకేషన్ పాలసీ)–2020 పేరిట ఈ నెల 2, 3 తేదీల్లో కళాశాల సెమినార్ హాల్‌లో జరగనున్న సదస్సు ఏర్పాట్లపై బుధవారం అధ్యాపకులతో సమావేశమయ్యారు. పలు కమిటీలను నియమించి, వారికి సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆజాదీ కా అమృత్ మహోత్సవ్ సందర్భంగా న్యూఢిల్లీలోని ఇండియన్ కౌన్సెల్ ఆఫ్ సోషల్ సైన్స్ రీసెర్చ్ (ఐసీఎస్ఎస్ఆర్) సహకారంతో ప్రతిష్టాత్మకంగా సదస్సును నిర్వహిస్తున్నట్టు చెప్పారు. ఉత్తరాంధ్రలో ఐసీఎస్ఎస్ఆర్ సౌజన్యంతో సెమినార్ నిర్వహించడం ఇదే తొలిసారని వెల్లడించారు. రాష్ట్రంలో జాతీయ విద్యా విధానంలో భాగంగా అనేక మార్పులు, సంస్కరణలను సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమల్లోకి తీసుకొచ్చారని అన్నారు. నాలుగేళ్ల డిగ్రీతో పాటు 'కమ్యూనిటీ సర్వీస్ ప్రాజెక్ట్'లు వంటివి డిగ్రీ విద్యావిధానంలోకి తీసుకొచ్చారని చెప్పారు. ఉన్నత విద్యాసంస్థలో ప్రవేశం కోసం ఉమ్మడి ప్రవేశ పరీక్ష నిర్వహించేందుకు జాతీయ టెస్టింగ్ ఏజెన్సీ(ఎన్‌టీఏ)కి అవకాశం, జాతీయ పరిశోధనా ఫౌండేషన్(ఎన్‌ఆర్‌ఎఫ్)ను ఏర్పాటు చేయడం, పరిశోధనలకు అధిక ప్రాధాన్యత ఇవ్వడం, పాఠశాల విద్య, ఉన్నత విద్యా వ్యవస్థలో వృత్తివిద్యకు ప్రాధాన్యత, అకాడమిక్ బ్యాంకు క్రెడిట్ ఏర్పాటు వంటివి ఎన్‌ఈపీ విధానం ద్వారా తెరపైకి వచ్చినట్టు ప్రిన్సిపాల్ వివరించారు. సదస్సులో పరిశోధకులు, అధ్యాపకులు, విద్యార్థులు పేపర్ ప్రజెంటేషన్ చేయవచ్చని పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటక, తమిళనాడు, ఒడిశా తదితర రాష్ట్రాల నుంచి నిష్ణాతులు ప్రధాన వక్తలుగా హాజరుకానున్నట్టు చెప్పారు. కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్, కాలేజియేట్ ఎడ్యుకేషన్ కమిషనర్ డాక్టర్ పోలా భాస్కర్, బీఆర్‌ఏయూ వీసీ ప్రొఫెసర్ నిమ్మ వెంకటరావు, విశ్రాంత వీసీలు, ఇతర ఉన్నతాధికారులు పాల్గొంటారని ప్రిన్సిపాల్ తెలిపారు.

ఏసీబీకి చిక్కిన ఎలక్ట్రికల్ ఏఈ


ఎలక్ట్రికల్ అసిస్టెంట్ ఇంజినీర్ వెంకటరమణ

శ్రీకాకుళం రూరల్: శ్రీకాకుళం రూరల్ మండల ఎలక్ట్రికల్ అసిస్టెంట్ ఇంజినీర్(ఏఈ) జి.వెంకటరమణ బుధవారం ఇద్దరు రైతుల నుంచి లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు పట్టుబడ్డారు. ఏసీబీ డీఎస్పీ బీవీఎస్ఎస్ రమణమూర్తి తెలిపిన వివరాల మేరకు.. శ్రీకాకుళం రూరల్ మండలం కిల్లిపాలెం గ్రామానికి చెందిన ఇద్దరు రైతులు తమ పొలాల్లో వ్యవసాయ బోర్లకు సంబంధించిన స్తంభాలు వేయాలంటూ ఏఈకి రెండు నెలల క్రితం దరఖాస్తు చేసుకున్నారు. వివిధ కారణాలు సాకుగా చూపి ఏఈ దరఖాస్తులను ఎప్పటికప్పుడు తిరస్కరించేవారు. లంచం ఇస్తేనే పని జరుగుతుందని తెలుసుకున్న రైతులు ఏసీబీ అధికారులను ఆశ్రయించారు. వారి సూచనల మేరకు ఒక్కో స్తంభానికి రూ.15 వేలు చొప్పున రూ.30 వేలు పట్టుకుని బుధవారం రాగోలు సబ్‌స్టేషన్‌లో ఏఈకి ఇస్తుండగా ఏసీబీ అధికారులు మాటు వేసి పట్టుకుని అరెస్టు చేశారు. ఈ దాడుల్లో సీఐలు భాస్కర్, హరి పాల్గొన్నారు.

ఆర్గానిక్ బెల్లం తయారీకి చేయూత

ఆమదాలవలస రూరల్: మహిళా స్వయం శక్తి సంఘాల్లో పంచ సూత్రాలు పాటిస్తూ, రుణాలు సక్రమంగా చెల్లించిన చెరకు రైతులను గుర్తించి ఆర్గానిక్ పద్ధతిలో బెల్లం తయారీ చేయించి మార్కెటింగ్ సౌకర్యం కల్పించేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు జిల్లా జీవనోపాధుల డీపీఎం నాగలక్ష్మి తెలిపారు. ఆమదాలవలసల మండలం నిమ్మతొర్లాడ, చేపానపేట గ్రామాల్లో బెల్లం తయారీ కేంద్రాలను బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జీవామృతం, ప్రకృతి విధానంలో బెల్లం తయారీకి చేయూత నిస్తామని చెప్పారు. యూనిట్ల స్థాపనకు గ్రూపు సభ్యుల ఆమోదంతో బ్యాంకు గ్యారెంటీ ఉన్న వారికి అదనపు మిషనరీ కొనుగోలుకు రుణ సౌకర్యం కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో స్త్రీనిధి బ్యాంకు ఏజీఎం సత్యనారాయణ, ఈశ్వరరావు, శ్రీనివాస్, ఏపీఎం పి.కూర్మారావు, గ్రామ సంఘం అధ్యక్షురాలు రోజా, వీఓఏ శారద, ప్రకృతి వ్యవసాయ వలంటీర్లు, మహిళా రైతులు పాల్గొన్నారు.